ఆకతాయిలకు అడ్డా!


ఆగంతకులు ఎత్తుకు పోయిన హాస్టల్ భవనం లోపలి కిటికీల తలుపులు


అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన పాడుబడిన మధురవాడ బీసీ హాస్టల్ భవనం

- అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా పాత హాస్టల్ భవనాలు
- ఇబ్బందులు పడుతున్న చుట్టుపక్కల ప్రజలు
- విద్యుత్ సిబ్బందికి అవస్థలు

మధురవాడ: జాతీయ రహదారికి కూత వేటు దూరంలో ఉన్న శిథిల భవనాలు ఆకతాయిలకు అడ్డాగా మారాయి. చీకటి పడితే అసాంఘిక కార్యక్రమాలకు వేదికవుతున్నాయి. మరి కొందరు డంపింగ్ యార్డుగా వినియోగిస్తున్నారు. వెరసి చుట్టు పక్కల ఇళ్ల వారితో పాటు ఆ భవనాలను ఆనుకుని ఉన్న విద్యుత్ శాఖ కార్యాలయ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

ఇదీ పరిస్థితి

మధురవాడలో విశాఖ జోన్‌-3 విద్యుత్ కార్యాలయానికి ఆనుకుని సుమారు 50 ఏళ్ల కిందట 20 సెంట్ల స్థలంలో నిర్మాణం చేసిన హాస్టల్ భవనం పూర్తిగా శిథిలమైంది. దీంతో పక్కనే మరో భవనం నిర్మాణం చేసి సుమారు పదేళ్ల కిందట అందులోకి హాస్టల్ మార్చారు.అయితే శిథిల భవనాన్ని అలాగే వదిలేయడంతో ఆకతాయిలు తమ కార్యకలాపాలకు దీన్ని వేదికగా మార్చుకున్నారు. ఈ శిథిల భవనానికి ఒక వైపు ప్రియదర్శిని కాలనీ మరో వైపు టైలర్స్ కాలనీలు ఉన్నాయి. పాడుబడిన, డంపింగ్ యార్డుకు చేర్చాల్సి వస్తువులు, చనిపోయిన జంతువులను కొందరు శిథిల భవనంలో పడేయడంతో డంపింగ్ యార్డు కంటే అధ్వానంగా తయారైంది. మరి కొందరు కిటికీలు ఇతర వస్తువులు ఎత్తుకెళ్లిపోయారు. పరిసరాలు కంపు కొడుతున్నాయి. పక్కనే ఉన్న రెండు హాస్టళ్ల విద్యార్థులతో పాటు విద్యుత్ కార్యాలయాల సిబ్బంది, సందర్శకులు దుర్వాసన, అపరిశుభ్ర వాతావరణంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఉన్నతాధికారులకు వివరించాం

ఇది చాలా పాత భవనం. పూర్తిగా దెబ్బతింది. ప్రమాదకరంగా మారింది. విద్యార్థులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను సాంఘిక సంక్షేమ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం.

-రమేష్, వార్డెన్, బీసీ బాలుర సమీకృత వసతి గృహం

దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం

ఊరి మధ్యలో పాడుబడిన భవనం ఉంది. దీన్ని డంపింగ్ యార్డు కంటే అధ్వానంగా మార్చేశారు. చనిపోయిన జంతువులు, చెత్త నుంచి వస్తున్న దుర్వాసనతో కార్యాలయాలు సిబ్బంది, సందర్శకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.

- ఎస్‌వీఎస్ రామమూర్తి, మధురవాడ విద్యుత్ శాఖ ఏఈఈ

భక్తిశ్రద్ధలతో చండీ హోమం


గోపూజ చేస్తున్న పీఠాధిపతి ప్రమణి స్వామి, నిర్వాహకులు

మధురవాడ: లోక కల్యాణార్థం మిథిలాపురి వుడా కాలనీలోని రామలింగేశ్వరస్వామి ఆలయం సమీపంలో రామలింగేశ్వర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో చండీ హోమం నిర్వహించారు. గణపతి పూజ, గోపూజతో కార్యక్రమాలు ప్రారంభించారు. విజయవాడ ఓంకార్ పీఠాధిపతి ప్రమణిస్వామి నేతృత్వంలో పండితులు నిర్వహించిన హోమంలో మిథిలాపురి వుడా కాలనీ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాలొని పూజలు చేశారు. కార్యక్రమంలో రామలింగేశ్వర చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ మహావ్రతయాజుల ధనుంజయరావు, మిథిలాపురి వుడా లేఅవుట్స్ నివాసితుల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు త్రిమూర్తులురాజు, ఎంవీ రమణమూర్తి, చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు, కార్యవర్గ సభ్యులు కోటేశ్వరరావు, మండ రమేష్, ఎ.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు నక్షత్ర హోమం

నవ గ్రహ, నక్షత్ర దోష నివారణార్థం శనివారం నక్షత్ర, నవగ్రహ, శ్రీరుద్ర హోమాలు నిర్వహించనున్నట్టు కమిటీ చైర్మన్ ధనుంజయరావు తెలిపారు. ఆసక్తి కల వారు తమను సంప్రదించి పాల్గోవాలని సూచించారు.

రెడ్డిక సామాజిక వర్గంలో కలపాలని వినతి


ఆర్డీవో భాస్కరరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న రెడ్డి, రెడ్డిక సంఘాల ప్రతినిధులు

తగరపువలస: రెడ్లను రెడ్డిక సామాజికవర్గంలో కలపాలని కోరుతూ శుక్రవారం భీమిలికి చెందిన రెడ్డి, రెడ్డిక సామాజిక వర్గాల ప్రతినిధులు ఆర్డీవో పి.భాస్కరరెడ్డికి వినతిపత్రం అందించారు. రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ శీరపు అప్పలరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ రెండో వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరెడ్డి తదితరులు భీమిలిలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బింగి హరికిరణ్‌రెడ్డి, మునకాల ఆదినారాయణరెడ్డి, ఎరుసు సోమిరెడ్డి, జీరు పద్మ, చిల్ల ప్రమీల, చిల్ల సూరిబాబు, చేట్ల అప్పలసూరమ్మ, చేట్ల ఎల్లయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

12న మాధవుడికి చందనోత్సవం


కుంతీ మాధవ స్వామి విగ్రహం

పద్మనాభం: పద్మనాభంలో వెలసిన కుంతీ మాధవ స్వామికి ఈ నెల 12వ తేదీన చందనోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. చందనోత్సవం గతంలో ఎప్పుడూ నిర్వహించలేదు. ఈ ఏడాది నుంచి చందనోత్సవం నిర్వహణకు శ్రీకారం చుట్టారు. ఆరోజు ఉదయం 5 గంటల నుంచి కుంతీ మాధవ స్వామి చందన అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు. భక్తులు స్వామి వారి కరుణాకటాక్షాలు పొందాలని ఆలయ కమిటీ కోరింది.

శ్రీవారికి ప్రత్యేక పూజలు


వస్త్రాలు తీసుకొస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రంతో పాటు అభిషేక సామగ్రిని మంగళవాయిద్యాల నడుమ తీసుకు వెళ్లారు. అభిషేకాలు నిర్వహించి శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ అధికారులతో పాటు అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

పిల్లలకు అన్నదానం


పిల్లలకు భోజనం వడ్డిస్తున్న నాయకులు

కొమ్మాది: మధురవాడకు చెందిన పోతిన అనిల్‌కుమార్ రెండో వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు శుక్రవారం ఎండాడలోని డిపాల్ మానసిక వికలాంగుల ఆశ్రమంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఆశ్రమ పిల్లలకు పండ్లు అందించి, మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. సోషల్ మీడియా ద్వారా వైఎస్సార్‌సీపీకి అనిల్‌కుమార్ చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పోతిన పైడిరాజు, సావిత్రి, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు పిల్లా కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గురుస్వామికి నివాళి

పద్మనాభం: మండలంలోని పాండ్రంగిలో శుక్రవారం గురుస్వామి ఆకేళ్ల నర్సింహమూర్తికి అయ్యప్ప భక్తులు ఘన నివాళులర్పించారు. నరసింహమూర్తి ఈ నెల నాలుగో తేదీన అకాల మరణం చెందారు. దీంతో అయ్యప్ప భక్తులు ఆయన ఫ్లెక్సీ వద్ద అంజలి ఘటించారు. పీఠాధిపతులు సిడం నారాయణప్పడు, బొబ్బిలి సంతు, మహంతి శ్రీనివాస్, పిన్నింటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా తాగునీటి బోరు


భూమిలోకి కూరుకు పోయిన బోరు

ఆనందపురం: మండలంలోని వేములవలస పంచాయతీ పరిధిలోని భీమిలి క్రాస్ రోడ్డు వద్ద ప్రభుత్వ లేఅవుట్‌లో వేసిన మంచినీటి బోరు భూమిలోకి కూరుకు పోయింది. దీంతో బోరు నుంచినీరు తీసుకోవడానికి అవకాశం లేకుండా పోయింది. కాలనీ ఇళ్లు నిర్మించాలని చాలా కాలం కిందట రోడ్లు నిర్మించి మంచినీటి బోరు ఏర్పాటు చేశారు. కాగా ఇళ్ల నిర్మాణం జాప్యం కావడంతో ఆ స్థలం చెత్తా చెదారాలు డంప్ చేయడానికి వినియోగిస్తున్నారు. రడీమేడ్ కాంక్రీట్ రవాణా చేసే వాహనాల్లో మిగిలిన కాంక్రీట్‌ను నీటితో కలిపి ఇక్కడ పారవేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా ఎత్తుగా మారి బోరు ఉన్న ప్రాంతం మూసుకు పోయింది. దీంతో బోరు వినియోగించడానికి అవకాశం లేకుండా పోయింది. ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఆ బోరు నీటిని వినియోగించుకునే వారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మంచినీటి బోరుని వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

నీడీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం రేపు

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని కీలిన్‌పేట సన్‌స్కూల్ ఆవరణలో ఆదివారం భీమిలి నీడీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు శుక్రవారం నిర్వాహకులు తెలిపారు. ఉదయం 8 నుంచి ప్రారంభమతుందని 150 మంది నుంచి రక్తం సేకరించడం లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. దాతలు స్వచ్ఛందంగా పాల్గొవాలని నిర్వాహకులు కోరారు.

7న మే డే సంబరాలు

తగరపువలస: మే డే వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 7న అంబేడ్కర్ కూడలిలో సాయంత్రం 4 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన చేపట్టనున్నట్టు సీఐటీయూ నాయకులు తెలిపారు. ప్రజానాట్యమండలిచే ప్రజాకవి గురజాడ అప్పారావు గురించి నాటిక, ఉత్తరాంధ్ర జానపద గాయకుల గీతాలు, అభ్యుదయ గీతాల ఆలాపన నిర్వహించనున్నట్టు భీమిలి డివిజన్ సీఐటీయూ నాయకులు కోరారు.

మజ్జిగ పంపిణీ

కొమ్మాది: బుద్ధ పౌర్ణమి పురస్కరించుకుని ప్రముఖ పర్యాటక ప్రాంతం తొట్లకొండపైకి వచ్చిన పర్యాటకులకు కొండా శంకర్రావు శుక్రవారం మజ్జిగ పంపిణీ చేశారు. ముందుగా ఇక్కడ బుద్ధుడికి పూజలు నిర్వహించారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన


కొబ్బరికాయ కొడుతున్న కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు


కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డులోని అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు తెలిపారు. కాపులుప్పాడ దరి కల్లివానిపాలెంలో శుక్రవారం సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సురేష్‌రెడ్డి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

సాయి ధ్యాన మందిర వార్షికోత్సవం


పూజలు చేస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: మండలంలోని శేరిఖండంలో షిర్డీ సాయి ధ్యాన మందిరం 13వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచామృత, కాగడ హారతి వంటి పూజాది కార్యక్రమాలు జరిగాయి. దీనిలో భాగంగా అన్నదానం చేశారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు, ఆలయ చైర్మన్ సంగు శ్రీనివాసరావు, సుంకర నారాయణరావుతో పాటు అధిక సంఖ్యలో భక్తులు సాయి నాథుని దర్శించుకుని పూజలు చేశారు.

కిరాణా షాపుల తనిఖీ


రేవిడిలో కిరాణా షాపులను తనిఖీ చేస్తున్న సీఐ సన్యాసినాయుడు

పద్మనాభం: మండలంలోని పలు గ్రామాల్లోని కిరాణా షాపులను శుక్రవారం సీఐ ఎస్.సన్యాసినాయుడు, పోలీసులు తనిఖీ చేశారు. రేవిడి, రెడ్డిపల్లి, పద్మనాభం, మద్ది గ్రామాల్లోని కిరాణా షాపుల్లో గంజాయి, గంజాయి కాల్చడానికి పేపర్ అమ్ముతున్నారా వంటి అంశాల లక్ష్యంగా పరిశీలించారు. ఏఎస్ఐ ఎస్.శ్రీనివాసరావు తదితరులు తనిఖీలు చేసిన వారిలో ఉన్నారు.

భయపెడుతున్న బావి



ఆర్‌జీకే కాలనీలో రక్షణ లేని నుయ్యి

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు మారికవలస ఆర్‌జీకే కాలనీలోని తాగునీటి బావికి రక్షణ కరువైంది. ఇక్కడ కొత్త కాలనీ 145వ బ్లాక్ సమీపంలోని సామాజిక బావికి రక్షణ లేక పోవడం, గోడ తక్కువ ఎత్తులో ఉండటంతో పలువురు ప్రమాదవశాత్తు దానిలో జారి పడి ప్రాణాపాయం నుంచి బయట పడిన సంఘటనలు అనేకం ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇక పిల్లలు, వృద్ధులు అయితే మరింత భయం భయంగా రాకపోకలు సాగించాల్సి వస్తోంది. నుయ్యికి రక్షణ లేని కారణంగా పిల్లలు, ఆకతాయిలు చెత్తాచెదారం వేసేస్తుండటంతో నీరు మురిగిపోయి ఎందుకూ పనికి రాకుండా పోతోంది. నూతి పైభాగంపై గ్రిల్స్‌తో మెస్ వేయించి శుభ్రం చేయిస్తే రక్షణ కల్పించనట్లవుతుందని స్థానికులు భావిస్తున్నారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పింఛన్‌దారులు ఈకేవైసీ చేయించుకోవాలి

భీమునిపట్నం: భీమిలి తాలూకా యూనిట్‌లో ఉన్న ప్రభుత్వ పింఛన్‌దారులు ఈకేవైసీ చేయించుకోవాలని యూనిట్ కార్యదర్శి ముంజేటి ఆనందరావు శుక్రవారం కోరారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలకు చెందిన పింఛనుదారులు చాలా మంది ఈకేవైసీ చేయించుకోలేదని తెలిపారు. అలాంటి వారు ఈనెల 11వ తేదీలోపు భీమిలిలోని సబ్ ట్రెజరీ కార్యాలయానికి ఆధార్‌కార్డుతోపాటు వివరాలు తీసుకుని వచ్చి ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. లేకపోతే వారికి పింఛన్ రాదని పేర్కొన్నారు.

ఆయన నేత్రాలు సజీవం


అప్పన్నబాబు(ఫైల్)

పద్మనాభం: మండలంలోని శేరిఖండం గ్రామానికి చెందిన పుప్పాల అప్పన్నబాబు (83) మరణాంతరం తన నేత్రాలను దానం చేశారు. తాను మరణించిన తర్వాత నేత్రాలను దానం చేయాలని ఆయన కుటుంబ సభ్యులకు చెప్పాడు. గురువారం అప్పన్నబాబు మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు ఐ బ్యాంకుకు సమాచారం ఇచ్చారు. విశాఖపట్నం ఎల్‌వీప్రసాద్ ఐ బ్యాంకు వారు గురవారం రాత్రి శేరిఖండం వచ్చి నేత్రాలను తీసుకువెళ్లారు. మృతుడు అప్పన్నబాబుకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత రాజలింగంపేట


విన్నర్స్‌కు ట్రోఫీ, నగదు బహుమతి అందిస్తున్న నిర్వాహకులు

తగరపువలస: భీమిలి జోన్ 2వ వార్డు రాజలింగంపేట గ్రామదేవత దుర్గాలమ్మ ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన క్రికెట్ టోర్నీలో విన్నర్‌గా అదే గ్రామానికి చెందిన జట్టు రూ.15వేల నగదు బహుమతి, ట్రోఫీ గెలుచుకున్నారు. 14 గ్రామాలకు చెందిన 52 జట్లు ఈ పోటీలో పాల్గొనగా శుక్రవారం ముగిశాయి. రన్నర్ జట్టు గొల్లలపాలెం కు రూ.10 వేలు, మూడో స్థానంలో నిలిచిన అగ్రహారం జట్టుకు రూ.5 వేలు, నాలుగో స్థానంలో నిలిచిన రాయపాలెం జట్టుకు రూ.3 వేల నగదుతోపాటు ట్రోఫీలు అందజేశారు. వీరికి శిల్లా వంశీరెడ్డి, బోర దుర్గారావు, పల్ల పైడయ్య, కర్రి బుజ్జి, బోర రామారావు, బోర వెంకట అప్పారావు, పీతల రాజారావు బహుమతులు అందించారు.

ఆర్‌ఎంపీలకు రిజిస్ట్రేషన్ అవసరం


మాట్లాడుతున్న జంగం జోషి

పద్మనాభం: ఆర్‌ఎంపీలకు రాష్ట్ర రిజిస్ట్రేషన్ అవసరమని ఆర్‌ఎంపీల సంఘం జోనల్ అధ్యక్షుడు జంగం జోషి అన్నారు. కృష్ణాపురంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం జరిగిన ఆర్‌ఎంపీల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామీణ వైద్యుడు ఈ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఆర్‌ఎంపీల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ జిల్లాలో 355 మంది గ్రామీణ వైద్యులున్నారన్నారు. సంతాన సాఫల్య వైద్య నిపుణురాలు సుధాపద్మశ్రీ స్త్రీల వ్యాధులు, కౌమార, బాల్య ,యవ్వన దశల్లో వచ్చే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. మండల ఆర్‌ఎంపీల సంఘం అధ్యక్షుడు రాలి అప్పారావు, ఎం.వి.రమణ, యు.తాతబాబు, పి.రామారావు, ఎం.వి.ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా అచ్యుత పూజ


కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు రుషికొండ దరి ఒమ్మివానిపాలెం సేవా గరిడి ఆధ్వర్యంలో శుక్రవారం ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగంగా అచ్యుత పూజ ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా తోడుపెద్దుల ఊరేగింపు, తిరువీధి మహోత్సవం తదితర కార్యక్రమాల ద్వారా సింహాద్రి అప్పన్న స్వామి మహిమలు వర్ణిస్తూ పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల గరిడీలు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

ఎండాడలో ట్రాఫిక్ కష్టాలు

కొమ్మాది: ఎండాడ జాతీయ రహదారిపై ట్రాఫిక్ కష్టాలు తీవ్రమవుతున్నాయి. ఇక్కడ రెండు నెలల కిందట హైవేపై లారీ సిగ్నల్ పోల్‌ను ఢీకొట్టడంతో అది పడిపోయింది. నాటి నుంచి ఇప్పటి వరకు పోల్ అలాగే ఉండటంతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. వాహనాల రాకపోకలు అడ్డదిడ్డంగా సాగుతున్నాయి. ట్రాఫిక్ అధికారులు పరిశీలించి సిగ్నల్ పోల్‌ను పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.

శిథిలమైన కాలువ పలకలు

వాహన చోదకులకు అవస్థలు


ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే అనుసంధాన రోడ్డు వద్ద శిథిలమైన కాలువ పలకలు

ఆనందపురం: పెందుర్తి సర్వీసు రోడ్డు నుంచి ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే మార్గం వద్ద కాలువపై పలకలు శిథిలమయ్యాయి. దీంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. పెందుర్తి సర్వీసు రోడ్డు నుంచి తహసీల్దారు, మండల పరిషత్, విద్యావనరుల కేంద్రం, విద్యుత్ సబ్ స్టేషన్, పంచాయతీ రాజ్ కార్యాలయం, ఇందిరా క్రాంతిపథం కార్యాలయాలకు చేరుకోవడానికి రోడ్డు ఏర్పాటు చేశారు. ఆరులేన్ల రహదారి నిర్మాణం అనంతరం కాలువ నిర్మించి సర్వీసు రోడ్డును కార్యాలయాలకు వెళ్లే రహదారితో అనుసంధానించారు. కాగా కాలువ నిర్మాణంలో లోపం, దానిపై వినియోగించిన పలకలు నాసిరకంగా ఉండడంతో వాహనాలు మలుపు తిరిగే సమయంలో వాటి భారానికి ఇరువైపులా పలకలు విరిగిపోయాయి. దీంతో వాహన చోదకులు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ప్రమాదాలు బారిన పడుతున్నారు. అక్కడ వాహన చోదకులు ఇరువైపులా వెళ్లడానికి అవకాశం ఉంది. దీంతో రోడ్డుకు ఇరువైపులా కాలువపై పలకలు దెబ్బతినడంతో వాహనాలు అతి కష్టం మీద మలుపు తీసుకోవాల్సి వస్తోందని చెబుతున్నారు. కార్యాలయాలకు ప్రతిరోజు వందలాది మంది కార్లు, ద్విచక్ర వాహనాలపై రాక పోకలు సాగిస్తున్నారు. దీంతో ఇబ్బందకరంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువపై పలకలను సరిచేయాలని పలువురు కోరుతున్నారు.

విద్యార్థుల మనోవికాసానికి విస్తృత కార్యక్రమాలు

దాబాగార్డెన్స్: 'ఈ దేశానికి మీరు చాలా అవసరం. మానసిక ఒత్తిడిలో సమాజం మీ వెంటే ఉంటుంది. ఆత్మహత్యలకు పాల్పడొద్దు. బలవన్మరణాల నివారణకు తబుల రాసా విస్తృత కార్యక్రమాలు చేపట్టనుంది' అని ఆ సంస్థ వ్యవస్థాపక చైర్మన్, సైకాలజిస్ట్ డాక్టర్ విజయభాస్కర్ బోనం తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో సామాజిక వేత్తలు, పలువురు సైకాలజిస్టులతో శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఇంటర్మీడియట్ ఫలితాల్లో విఫలమైన విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడ్డారని గుర్తుచేశారు. ఎన్‌సీబీఆర్ సర్వే ప్రకారం ప్రతి 46 నిమిషాలకు ఒక విద్యార్థి.. అంటే సుమారుగా రోజుకు 36 మంది.. ఏడాదికి 12,400 మంది చొప్పున విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, అందులో 14 నుంచి 24 ఏళ్ల వయసు వారే ఉన్నారని తెలిపారన్నారు. వీటిని శాశ్వతంగా నిర్మూలించాలంటే విద్యా సంస్థలోనూ, విద్యా విధానంలోనూ, తల్లిదండ్రులు, విద్యార్థులు, టీచర్లు అవగాహన పొందాలన్నారు. విద్యార్థుల్లో మనోధైర్యాన్ని పెంచేలా, సైకాలజిస్ట్‌చే మెంటల్ హెల్త్ అవగాహన కార్యక్రమాలు తరచుగా నిర్వహించాలని నిర్ణయించినట్టు చెప్పారు. భవిష్యత్‌లో వివిధ విద్యా సంస్థలు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, తల్లిదండ్రులను చైతన్య పరిచే కార్యక్రమాలు, నివారణ మార్గాలు విస్తృతంగా చేయనున్నట్టు వివరించారు. సామాజిక వేత్త జి.ఎ.నారాయణరావు, డాక్టర్ రాజ్యలక్ష్మి, కె.నిరుపమ, శ్రీదేవి, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే శిక్షణ ప్రారంభం


కరాటే శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

తగరపువలస: భీమిలి సెడార్ స్కూల్ ఆవరణలో ఈ నెల 28 వరకు జరగనున్న కరాటే ఉచిత శిక్షణ శిబిరాన్ని శుక్రవారం రెమో యాదవ్ మాస్టర్ ప్రారంభించారు. 5 నుంచి 15 ఏళ్ల లోపు చిన్నారులకు ప్రతిరోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.